విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

శుక్రవారం 09 మే 2025 8 పేజీలు

పండుకాదు విషం!

- కాల్షియం కార్బైడ్ రసాయనాలతో ఆరోగ్యానికి హానీకరం..
- ప్రజల ఆరోగ్యంతో మామిడి వ్యాపారులు చలగాటం..
- జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేయండి..
- నిషేధిత రసాయనాలు వాడితే క్రిమినల్ కేసులు ...
- జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరిక

మంచి రంగుతో నిగనిగలాడే మామిడిని చూసి మోసపోవద్దని కాల్షియం కార్బైడ్, హానికారక, నిషేధిత రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లతో ప్రజారోగ్యానికి పెనుముప్పు ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.మామిడి, అరటి, బొప్పాయి వంటి తొందరగా పాడయ్యేందుకు అవకాశమున్న పండ్లను మగ్గబెట్టడానికి నిషేధిత రసాయనాలు వాడకుండా తీసుకుంటున్న చర్యలపై సమీక్షించేందుకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది.

విశాలాంధ్ర-విజయవాడ: వరిగడ్డి వంటి వాటిలో మగ్గబెట్టిన పండ్లతో ఆరోగ్యానికి ఎలాంటి హానీ జరగదని.. అలా కాకుండా హానికారక రసాయనాలు వాడితే ఆర్సెనిక్, ఫాస్ఫరస్ అవశేషాలతో చర్మ రోగాలు, గొంతు సమస్యలు వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. నిషేధిత రసాయనాలు వాడకుండా రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని కృత్రిమంగా మగ్గబెట్టేందుకు అనుమతి ఉన్న ఈథెఫోన్ ఫౌడర్‌ను ఉపయోగించే విధానంతో పాటు ఇథిలీన్ ఛాంబర్లపైనా అవగాహన కల్పించాలన్నారు. 100 పీపీఎం వరకు మాత్రమే ఇథిలీన్ ట్రీట్‌మెంట్‌కు అనుమతి -మిగతా 2 లో ...

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-వినుకొండ : ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో వినుకొండ శివయ్య భవన్లో గురువారం ఈనెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సన్నాహకంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ నాయకులు షేక్ కొండ్రముట్ల చిన్న సుభాని అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మారుతి వరప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగునున్న సార్వత్రిక సమ్మెను ఉభయ కార్మిక సంఘాలు మరియు రైతు సంఘాలు ఐక్య కార్యాచరణని రూపొందించుకొని జయప్రదం చేయాలని, ఈ లోగా విస్తృతంగా సార్వత్రిక సమ్మెను వివరిస్తూ -మిగతా 2 లో ...

కలెక్టర్ బాలాజీకి రెడ్‌క్రాస్ పురస్కారం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, అంతర్జాతీయ తలసేమియా దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని రాజభవన్ దర్బార్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్‌లకు పురస్కారాలు అందజేశారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ నజీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 రక్తదాన కేంద్రాలు నడుస్తున్నాయని, ప్రతి సంవత్సరం 65 వేల యూనిట్ల రక్తం సేకరించడం జరుగుతుందని తెలిపారు. రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ఠ సేవలు అందించిన -మిగతా 2 లో ...

లేబరు కోడ్‌లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-దాచేపల్లి: నాలుగు లేబరు కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దాచేపల్లిలోని పత్తిపాటి రోశయ్య కాలనీ, నారాయణపురం పార్టీ కమిటీల ఆధ్వర్యంలో రెండు మహాసభలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రెండు సభలకు సీపీఐ మండల కార్యదర్శి కొమెర వెంకట్రావు, సీపీఐ సీనియరు నాయకుడు తమ్మిశెట్టి శ్రీరాములు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా హాజరైన షేక్ హుస్సేన్, కాసా రాంబాబు మాట్లాడుతూ -మిగతా 2 లో ...

మచిలీపట్నం కమిషనర్‌కు మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

వివరాలు 3 లో ...

రావుపల్లికి పరామర్శ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సంగం జాగర్లమూడిలోని డీవీసీ హాస్పిటల్‌లో మోకాళ్ళ శస్త్రచికిత్స చేయించుకున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు, కార్మిక నేత రావులపల్లి రవీంద్రనాథ్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, ముఠా కార్మిక ఫెడరేషన్ నాయకులు చల్లా చిన్న ఆంజనేయులు, నాయకులు జి.సురేష్ బాబు, రావుల అంజిబాబులు గురువారం హాస్పిటల్‌కు వెళ్ళి పరామర్శించారు. త్వరగా కోలుకొని కార్మికుల కోసం పోరుబాటలో పయనించాలని వారు ఆకాంక్షించారు.

14న మెగా జాబ్ మేళ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో ఈ నెల 14న జలగం రామారావు మెమోరియల్ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో జరగబోవు -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

పండుకాదు విషం!

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఉందని, అయితే ఈ ఫౌడర్ ప్యాకెట్లను ఎట్టిపరిస్థితుల్లోనూ పండ్లకు నేరుగా తాకకుండా చూడాల్సిన అవసరముందన్నారు. మామిడి పండ్ల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహజ పద్ధతులతో మగ్గిన పండ్లు, హానికారక రసాయనాలతో మగ్గిన పండ్ల మధ్య తేడాను గుర్తించడంపైనా అవగాహన కల్పించాలని, కార్బైడ్ ఉపయోగించి మగ్గబెట్టిన పండ్లపై నల్లని మచ్చలుంటా యని వివరించారు. బాగా కడిగి పండ్లు తినేలా అవగాహన కల్పించాలన్నారు.

ఉమ్మడి తనిఖీలను ముమ్మరం చేయండి:

పట్టణ ప్రాంతాలతో పాటు నున్న, కేదారేశ్వరపేట వంటి మార్కెట్లలో ఆహార భద్రత, మునిసిపల్, ఉద్యాన, మార్కెటింగ్ శాఖల అధికారుల బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాలని, శాంపిళ్లను సేకరించి పరీక్షలకు పంపాలన్నారు. నిషేధిత రసాయనాలు వాడినట్లు తేలితే ఆహార భద్రత, ప్రమాణాల చట్టం మేరకు క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా కార్బైడ్, నిషేధిత రసాయనాలు ఉపయోగిస్తే ఆ విషయాన్ని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నంబరు 94403 79755కు ఫోన్‌చేసి తెలియజేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో జిల్లా ఆహార భద్రత అధికారి, కమిటీ సభ్య కన్వీనర్ ఎన్.పూర్ణచంద్రరావు, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ, గజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్‌బాబు, ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బాలాజీకి రెడ్‌క్రాస్ పురస్కారం

కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీకి బంగారు పతకం, పురస్కారం అందజేసి... అభినందించారు. గత ఏడాది బుడమేరు, కృష్ణానది వరదలలో జిల్లా ప్రజలను ఆదుకునేందుకు బాలాజీ చేసిన కృషికి గుర్తింపుగా రెడ్‌క్రాస్ ఈ అవార్డును ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మానవతా సేవా కార్యక్రమాల బలోపేతానికి కృషి చేస్తున్న వారికి ఈ అవార్డు విశిష్ట గుర్తింపుగా నిలుస్తుందని గవర్నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్, గవర్నర్ కార్యదర్శి డా. ఎం.హరిజవహర్‌లాల్, ఐఆర్‌సిఎస్ చైర్మన్ వైడీ రామారావు, రెడ్‌క్రాస్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ సీఈఓ, ప్రధాన కార్యదర్శి ఎ.కె.ఫరీదా, రాజ్‌భవన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లేబరుకోడ్‌లు రద్దు చేయాలి

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నట్లు ఆరోపించారు. ఈ సమస్యల పరిష్కారంలో భాగంగానే ఈ నెల 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా తలపెట్టిన సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. హామీలను అమలు చేయకుండా సూపర్ సిక్స్ తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కినట్లు విమర్శించారు. నిత్యావసర సరకుల ధరలు నింగినంటుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాచేపల్లి జీవనది నాగులేరుపై వంతెనకు ఇరువైపులా లో లెవెల్ చప్టాలు నిర్మించా లని కోరారు. బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రానున్న ఖరీఫ్ సీజను నేపథ్యంలో మేజరు కాల్వ లను అభివృద్ధి చేసి చివరి భూముల వరకు సాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఏఐటీయూసీ గురజాల నియోజకవర్గ అధ్యక్షుడు వేముల వెంకట రెడ్డి, సీపీఐ గురజాల నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, సీనియరు నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, లంకా శాంతి, షేక్ గాలీసా తదితరులు మాట్లాడారు. ఈ రెండు కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దాడి కేసులో రిమాండ్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కొండవరంలో ఏప్రిల్ 14వ తారీఖున దాడి చేస్తున్న సంఘటనలో ముద్దాయిని అరెస్ట్ చేసి మచిలీపట్నం రెండవ జే.ఎఫ్ .సీ.ఎం .కోర్టులో గురువారం హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 21వతారీకువరకు రిమాండువిధించారని కూచిపూడి ఎస్సై కేవిన్ విశ్వనాథ్ గురువారం రాత్రి విలేకరులకు తెలిపారు. గత నెల14వ తారీఖున కాకుల అశోక్ కుమార్ అదే గ్రామానికి చెందిన దాసరి పవన్ కుమార్ ల మధ్య జరిగిన గొడవలో అశోక్ కుమార్ పై సుత్తితో దాడి చేసి కొట్టిన సంఘటనలపై పవన్ కుమార్ ని అరెస్ట్ చేసి నట్లు వివరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కరపత్రాలు మైక్ ప్రచారం నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున నిర్వహించా లని కేంద్ర ప్రభుత్వ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు బ్యాంకులు ఎల్ఐసి మున్సిపాలిటీ, ఆర్టీసీ తదితర పబ్లిక్ సెక్టార్ కార్మికులందరూ కూడా సమ్మెలో పాల్గొనే విధంగా ఆయా సంఘ నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి కార్మిక రైతు వ్యతిరేక విధానాలు కార్మికులు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను నాలుగు కోడ్లు గా విభజించి కార్మికుల హక్కులను హరిస్తున్నారని రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేయుటకు రైతు చట్టాలు తెచ్చి రైతులకు అన్యాయం చేయ తల పెట్టారని దీనిని గ్రహించిన రైతు సంఘాలు చారిత్రక పోరాటం చేసి తిప్పి కొట్టారని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ. పల్నాడు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉభయ కార్మిక సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నామని ఈనెల 17వ తేదీన సమ్మెను విజయవంతం చేయమని మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించాలని, జిల్లావ్యాప్తంగా మైక్ ప్రచారం కరపత్రాల ప్రచారం రెండు రోజులు పాటు 10 నుండి12వ తేదీ వరకు నిర్వహించాలని తీర్మానించడమైనదని కావున ఆయా నియోజకవర్గాలలో ప్రభుత్వ రంగ ప్రైవేట్ రంగంలో ఉన్నటువంటి కార్మికులు ఐక్యంగా పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు హనుమంత రెడ్డి మాట్లాడుతూ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్నారని ప్రభుత్వ విధానాలను నిలువరించాలని కార్మికులపై తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు ఉలవలపూడి రాము, ఎ గోపాలరావు, బూదాల శ్రీనివాసరావులు మాట్లాడుతూ. కేంద్రం కార్మికులపైనే కాకుండా రైతులపై వ్యవసాయ రంగంపై కూడా తనకబంధహస్తాలను ప్రయోగించి రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే కార్యక్రమాన్ని ఉధృతం చేస్తున్నారని దీనిని గమనించిన కార్మికులు రైతు సంఘాలు ఏకమై కేంద్రానికి వ్యతిరేకంగా పోరాట కార్యక్రమాలు రూపొందిస్తున్నారని దానిలో భాగమే ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మె అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బొంకూరి వెంకటేశ్వర్లు వెంకటప్పయ్య , ఏఐటియుసి నాయకులు పఠాన్ లాల్ ఖాన్, రాయబారం వందనం, బూదాల చిన్న, పిస్సబోయిన వెంకటేశ్వర్లు, షేక్ కిషోర్, కొప్పరపు మల్లికార్జునరావు, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రేవల్ల శ్రీనివాసరావు, షేక్ నాగూర్, పారిశుద్ధ్య కార్మిక నాయకులు సంపెంగుల అబ్రహం రాజు, శామంత పూడి సాయిబాబు, పచ్చి గొర్ల ఏసు, దేవమ్మ, కొప్పరపు మల్లికార్జునరావు, తదితరులు జండా ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. 17వ తేదీన సమ్మెను విజయవంతం చేయాలని మోటార్ సైకిల్ ర్యాలీని విజయవంతం చేయాలని, రెండు రోజులు మైక్ ప్రచారం నిర్వహించాలని కార్మికులు పబ్లిక్ రంగా సంస్థల ప్రాంతాలలో కరపత్రాల ప్రచారం చేయాలని నిర్ణయించారు.

వీధి వ్యాపారుస్థులకు భద్రత కల్పించాలి

మూలీ సాంబశివరావు

విశాలాంధ్ర-విజయవాడ: వీధి వ్యాపారుస్థులకు భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలీ సాంబశివరావు కోరారు. గురువారం జరిగిన నగర వీధి విక్రయ కమిటీ తొలి సమావేశంలో నగర కమిషనర్ ధ్యానచంద్ర కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా పలు అంశాలను కమిషనర్ దృష్టికి నాగేశ్వరావు తీసుకువచ్చారు. విక్రయదారులకు గుర్తింపు కార్డులు, అకౌంట్ ఓపెన్ చేసి విక్రయ మార్కెట్స్ ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు యక్కల కృష్ణ, సీహెచ్‌వి మారుతీరావు, ఎస్ సాబీర్, పిల్ల నాగమల్లేశ్వరి, వి శ్రీనివాసరావు, కంకిపాటి రత్నకుమారి, బొమ్మిశెట్టి జగన్‌మోహన్ తదితరులు హాజరైయ్యారు.

చదరంగంతో జ్ఞాపకశక్తి

- సైకియాట్రిస్ట్ డాక్టర్ కే మానస

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : చదరంగం ఆడటం వలన జ్ఞాపకశక్తి మెరుగు అవుతుందని సైకియాట్రిస్ట్ డాక్టర్ కే మానస, చార్టెడ్ అకౌంటెంట్ కంచర్ల పూర్ణచంద్రరావు తెలిపారు. నగరంలోని గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ చెస్ కోచింగ్ క్యాంప్ ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రస్తుతం చదువులకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్క విద్యార్థి క్రీడలకు కొంత సమయం కేటాయించాలన్నారు. చదరంగం లాంటి ఆటల వలన పిల్లలు యొక్క శారీరకంగా మానసంగా దృఢంగా ఉంటారన్నారు. అనంతరం గ్లోబల్ చెస్ అకాడమీ కార్యదర్శి ఎస్ కే కాసీం మాట్లాడుతూ నాలుగు రోజులు పాటు నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో మున్సిపల్, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కోచింగ్ క్యాంప్ లను మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీలో, పడమటి లోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో రెండు బ్యాచ్లుగా నిర్వహించినట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 9849514138 నెంబర్ ను సంప్రదించాలన్నారు

14న మెగా జాబ్ మేళ

మెగా జాబ్ మేళా పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తన ఛాంబర్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాబ్ మేళాలో సుమారు 40 కంపెనీలు పాల్గొంటున్నాయని, 1200 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ఉన్న యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ జాబ్‌మేళాలో 10వ తరగతి నుంచి బీటెక్ వరకు చదువుకున్న ప్రతిఒక్కరూ పాల్గొనవచ్చని విద్యార్హతను బట్టి జీతం రూ.9 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటుందని తెలిపారు. 18-25 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువత బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని చెప్పారు. వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరసింహారావు పాల్గొన్నారు.

కృష్ణవేణి సేవలు ఆదర్శవంతమైనవి

-నివాళులు అర్పించిన జి కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలోని 10వ డివిజన్ కార్యదర్శి బియ్యపు నరసింహారావు సతీమణి కృష్ణ వేణి సీపీఐ నగర సమితి ఘన నివాళులు అర్పించింది. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణవేణి పాత 10వ డివిజన్ మహిళా సమాఖ్య కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. ఆమెకు అయిదుగురు పిల్లలు కూడా ఆమె బాటలోనే నడుస్తూ పార్టీ పిలుపు మేరకు పలు పోరాటాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు కొరగంజి దుర్గాంబ, డి.రమణమ్మ, పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టు రమణారావు,ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు పిచ్చయ్య, నగర నాయకులు రాయన గురునాధం. బియ్యపు కృష్ణ, భాను తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

వీధి విక్రయ దారుల కమిటీతో సమస్యలు పరిష్కారం : కమిషనర్ ధ్యానచంద్ర

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని వీధి విక్రయ దారుల సమస్యలు టౌన్ వీధివిక్రయ దారుల కమిటీ ద్వారా పరిష్కరించుకోవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో కమిషనర్ గురువారం పట్టణ వీధి విక్రయదారుల కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పడిన టౌన్ వెండింగ్ కమిటీలో 19 మంది సభ్యులు, కమిటీ చైర్మెన్‌గా కమిషనర్ ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో వీధి విక్రయ దారుల సమస్యలు ఈ కమిటీ ద్వారా తెలియజేయాలన్నారు. వీధి విక్రయ దారులకు ఐడి కార్డులు జారీ చేయాలని, వ్యాపారం చేసే ప్రతి వీధి వ్యాపారస్తులకు ట్రేడ్ లైసెన్స్ ఉండాలన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్

విశాలాంధ్ర-మచిలీపట్నం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ, సిఐటియు రాష్ట్ర కమిటి పిలుపు మేరకు నోటీసును మున్సిపల్ కమిషనర్ సి హెచ్‌వివిఎస్ రాజుకి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ మే 20న కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఉన్నటు వంటి ఉద్యోగ కార్మికులకు కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని, ధరలను నియంత్రించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ మే '20'న సమ్మెకు పిలుపు ఇచ్చారని, ఆ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జాతీయ కార్మిక సంఘాల పిలుపును బలపరుస్తూ సమ్మెను నిర్వహించదలిచామని ఆయన అన్నారు. రాష్ట్రంలో మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. సిఐటియు నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మునిసిపల్ పర్మినెంట్ కార్మికుల పెండింగ్లో ఉన్న 6 డి ఏ లు విడుదల చేయాలని, మునిసిపల్ విభాగంలో ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంపుకై గత ప్రభుత్వంలో నియమించబడిన కమిటీ నివేదికల ఆధారంగా వేతనాలను పెంచాలని పెంచి,మున్సిపల్ ఉద్యోగ కార్మికులకు పెండింగ్ ఉన్న సరెండర్ లీవుల ఎనాక్యాష్మెంట్ సత్వరం విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కర్నాటి అర్జున్ రావు, సీరంశెట్టి వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి వజీర్, యర్రం శెట్టి శ్రీమన్నారాయణ, బి మణికంఠ, సిఐటియు నాయకులు జయరాం, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిడుగులతో కురిసిన వర్షం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడిలో గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా వాతావరణం మారి పిడుగులు పిడుగులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో మొవ్వ రోడ్డులోని కూచిపూడిలో డాక్టర్ గొట్టిపాటి రామకృష్ణారావు (పెదపూడి) హాస్పిటల్ ఎదురుగాగల తాడిచెట్టిపై పిడుగు పడి కాలిపోయింది. అలాగే సమీపంలోనే మరొక చోట కూడా పిడుగు పడినట్లు సమాచారం!. విపరీతంగా వీచిన గాలుల సందర్భంగా పలు ప్రాంతాలలో చెట్లు విరిగి విద్యుత్ లైనులపై పడగా స్తంభాలు విరిగి పడిపోవటంతోవిద్యుత్తుకుతీవ్ర అంతరాయం ఏర్పడింది. భట్లపెనుమర్రు,పెదసనగంటి పాలెం, చినముత్తేవి ప్రాంతాలలో చెట్లు విరిగి విద్యుత్ మీద పడి నట్లు సమాచారం. సబ్ స్టేషన్.ఏఈ రమేష్ పర్యవేక్షణలో ఎల్ ఐ.శ్రీహరి కరెంటు పునరుద్ధరించే కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీవేజ్ ప్లాంట్ నిర్మాణానికి స్థలం సేకరించాలి : ఆర్టీఓ

విశాలాంధ్ర-పెడన : పట్టణంలో సీవేజ్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి స్థలం కోసం గురువారం పెడన తహసిల్దార్ ఛాంబర్‌లో రెవిన్యూ మున్సిపల్ అధికారులు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన స్థలం గల యజమానులతో మచిలీపట్నం ఆర్టీవో కె. స్వాతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఎకరానికి రూ. 1.12 కోట్లు ఇస్తుందని దీనికి రెట్టింపు ధర అంటే రూ. 2.24 కోట్లు చెల్లించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని అన్నారు. మంచి ధర వస్తున్న నేపథ్యంలో పునరాలోచన చేయాలని నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయని ఆర్టీవో స్పష్టం చేశారు. తమకు రూ. 3.50 ఓట్లు కావాలని పలువురు కోరడంతో ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో 2 సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లతో పాటు ఒకటి నేచురల్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించడం జరుగుతుందని అన్నారు. ఈ మూడు ప్లాంట్ల నిర్మాణానికి 1.76 ఎకరాలు అవసరమని గుర్తించడం జరిగిందని స్పష్టం చేశారు. దీంతో 96 సెంట్లుకి పలువురు యజమానులు అంగీకరించారు. మిగిలిన 80 సెంట్లుకు సంబంధించి రేటు విషయంలో ముందుకు రావడంలేదని అన్నారు. వారితో కూడా పలుదపాలు చర్చించి ఆమోదించేలా చూడడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి తహసిల్దార్ కూనప రెడ్డి. అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మన్నెం గోపాలరావు, టౌన్ ప్లానింగ్ అధికారిణి బళ్ళ. సృజన కుమారి, మండల పట్టణ సర్వేయర్లు స్థల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-ఘంటసాల: శ్రీకాకుళంలో కొండవీటి కృష్ణమూర్తి సతీమణి రత్నకుమారి జ్ఞాపకార్థం, కొండవీటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని యువ నాయకులు మండల వెంకట్ రామ్ ప్రారంభించార . ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ జనసేన పార్టీ నాయకుల సేవానిరతి స్ఫూర్తిదాయకం అన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, ఘంటసాల ఏఎంసీ చైర్ పర్సన్ తోట కనకదుర్గ, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), టీడీపీ గ్రామ అధ్యక్షులు దాశం రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ కొమరగిరి నాగిని, మాజీ ఎంపీటీసీ ఆత్మూరి సీతారామయ్య, కూటమి నాయకులు బాబూరావు, కొండవీటి లీలాకృష్ణ, కొండవీటి నాగేశ్వరరావు, కొండవీటి వెంకట్రావు, యారా శ్రీనివాస రావు, శీలం కోటేశ్వరరావు, జీళ్ళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జవాన్లకు న్యాయవాదుల సంఘీభావం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : 150కోట్ల ప్రజానీకానికి, భారత ప్రజాస్వామ్యానికి ప్రతి క్షణం వారి ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్న త్రివిధ దళాల వీర సైనికులకు జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ సభ్యులు సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు గురువారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నె పాగ సుందరరావు సారధ్యంలో జరిగిన సంఘీభావ సభకు న్యాయవాదులు హాజరై ముక్త కంఠంతో త్రిదళ వీర జవాన్లకు జై జై లు పలుకుతూ సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన సైనికులు వారు పదవి విరమణ చేసిన సందర్భంలో వారు ఒక బాండ్ ఇస్తారని యుద్ధం వచ్చినప్పుడు సైన్యంలోకి రావాలని పిలుపు వచ్చిన వెంటనే సర్వాన్ని త్యజించి తన భార్య, పిల్లలను వదిలివేసి దేశ ప్రజల రక్షణ కోసం, దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించడానికి సిద్ధంగా ఉన్నామని వారు మాట్లాడే మాటలకు ప్రజలు యుద్ధానికి సిద్ధం అయ్యే విధంగా చైతన్యవంతులై దేశ రక్షణని కాపాడే విధంగా ఉద్యుక్తులవుతున్నారు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బద్దుల వెంకటరామయ్య, శ్రీనివాస్ గౌడ్,జోనేబోయిన శ్రీనివాసరావు, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, గుంటక లక్ష్మి నారాయణ, ఆంజనేయులు,దాసరి నాగేశ్వరావు, ఆరెపల్లి వెంకటేశ్వర్లు,సంతోష్, శ్రీనివాసరావు, శోభ తొరనే, గంటా కృష్ణంరాజు,శ్రీనివాసరావు,దేశింగ్ రాజు, రావూరి ప్రసాద్,పూల నాగరాజు, చిన్న గాంధీ, రవి,నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కుమార్ రాజా

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వింజనంపాడు గ్రామ పంచాయతీ రోడ్డు రూ.5 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు కూచిపూడి శ్రీనివాస్, ఆ పార్టీ లీగల్ విభాగం అధ్యక్షుడు గోరిపర్తి రవి కుమార్, పంచాయతీరాజ్ ఏఈ డి రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా - ఇద్దరి మృతి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని విన్నకోట గ్రామంలో గురువారం ఉదయం పెళ్లి నిమిత్తం 20 మంది గ్రామస్థులతో గాజులపాడు వెళుతుండగా ట్రాక్టర్ పక్కనే ఉన్న పొలములోకి తిరగబడింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ ట్రక్కు క్రింద పడి ఇద్దరు యువకులు మృతి చెందగా ఐదుగురికి గాయాలు అయ్యాయి. మృతి చెందిన వారిలో మొదట వ్యక్తి ముత్యాల అరుణ్‌బాబు తండ్రి నాగరాజు (16) ఇతను గుడ్లవల్లేరు కళాశాల నందు పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని ఉన్నాడు. రెండో వ్యక్తి అయిన కనకవల్లి అభిషేక్ తండ్రి మురళీకృష్ణ (15). ఇతను తొమ్మిదవ తరగతి వరకు చదువుకుని ఇంటి వద్ద పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గాయపడిన ఐదుగురు వ్యక్తులు గుడివాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఐదుగురిలో ఒకరు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గుడ్లవల్లేరు ఎఎస్ఐ వి బాల వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు ఒప్పందంతో ప్రజలపై అదనపు భారాలు

తక్షణమే రద్దు చేయాలని విద్యుత్ ఐక్యవేదిక డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ఎంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకోకుండా యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో సోలార్ ఒప్పందం ఖరారు చేసుకోవటాన్ని విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక వ్యతిరేకిస్తున్నదని వేదిక కన్వీనర్ ఎమ్ వి ఆంజనేయులు అన్నారు. విద్యుత్ ఒప్పందం ద్వారా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాల పెంపుదల నేపథ్యంలో ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక గిరిపురం సెంటర్ వద్ద ఉన్న బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 400 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ విండ్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టు నుండి యూనిట్ రూ.4.60 పైసలకు కొనుగోలు చేసే విధంగా విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందం చేసుకుందని ఇది సరైనదికాదని, గత ప్రభుత్వం అదానీ కంపెనీ నుండి సోలార్ విద్యుత్ ను కొనుగోలు చేయడానికి యూనిట్ రూ.2.49 పైసలకు సెకీతో ఒప్పందం చేసుకుందన్నారు. ఈ సమావేశంలో టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి సాంబిరెడ్డి, పున్నారావు రామరాజు,అరుణకుమార్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-మచిలీపట్నం : కార్మిక వర్గాల ప్రయోజనాల కోసం ఈ నెల 20వ తేదీ చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి కృషి చేయడానికి వివిధ యూనియన్లకు చెందిన నాయకులు సంఘీభావం ప్రకటించారు. గురువారం స్థానిక మహాత్మ జ్యోతి రావు పూలే విజ్ఞాన కేంద్రంలో నగర సిఐటీయు అధ్యక్షులు బాలసుబ్రమణ్యం అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి ఒంటిపులి లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికులకు నెలవారి కనీస వేతనం రూ.26 వేల ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేసి కార్మిక ప్రయోజనకర చట్టాలను కొనసాగించాలన్నారు. కార్మికులకు 8 గంటల పని విధానం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి దారీ వర్గాలు కార్మికులతో అదనంగా రెండు మూడు గంటలు పని చేయించుకుని శ్రమదోపిడికి పాల్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు చిన్న మధ్యతరగతి పరిశ్రమలను బలిపెడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను మార్చిందని ఆయన అన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రం శెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు కార్మికులహక్కులను కాలు రాస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసే విధానాలు కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసి సంస్థలు మనగడకు దోహదపడాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా బ్యాంకింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కోశాధికారి పూస ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారం కోసం 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెలో ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు ఔట్సోర్సింగ్ విభాగం వాళ్ళు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొంటున్నారని సమ్మె విజయవంతరానికి బ్యాంకింగ్ యూనియన్ తరపున తమవంతు సహకారం అందిస్తామన్నారు. సీఐటీయూ నగర కార్యదర్శి చిరువోలు జయరావు మాట్లాడుతూ కార్మికుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి.చంద్రపాల్ మాట్లాడుతూ మచిలీపట్నంలో 20వ తేదీ సమ్మె విజయవంతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. మెడికల్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మదిరి ఫణీంద్ర ఐఎన్టీయూసీ యూనియన్ నాయకులు షేక్ ఆయుబ్ బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మహ్మద్ యూనస్, అవనిగడ్డ ధర్మపురి తదితరులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల శాఖ గ్రంథాలయంలో గురువారం వేసవివిజ్ఞాన తరగతులు నిర్వహించారు. క్రాఫ్ట్ మాస్టారు ఏం కనకారావు విద్యార్థులకు కలర్ పేపర్స్తో నేమ్స్ రాసే పద్ధతిని, డ్రాయింగ్ మాస్టర్ నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు యు అనే అక్షరం ద్వారా పప్పీ బొమ్మ వేయటం విద్యార్థులకు నేర్పినారు, అనంతరం విద్యార్థులు బుక్ రీడింగ్ చేయడమైనది. గ్రంథాల అధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించినారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

విశాలాంధ్ర-గంపలగూడెం : స్థానిక శ్రీ వేణు గోపాల స్వామి వారి దేవస్థానంలో వైశాఖ మాసం సందర్భంగా గురువారము సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. శ్రీ వేణుగోపాల స్వామి వారికి, అమ్మవార్లకు మల్లెపూలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కార్య నిర్వాహణాధికారి నేల. సంధ్య, ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి. గోపాలచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-పెడన: మేమున్నాం సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని బందరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి స్వాతి అన్నారు. పట్టణంలోని 17 వ వార్డులో నివాసం ఉంటున్న పేద విద్యార్థిని ఉమ్మిటి హారిక కు చదువు నిమిత్తం దాతల సహకారంతో మేమున్నాం సేవా సంస్థ 33 వేల రూపాయల నగదు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు ఆర్డీవో చేతుల మీదుగా ఫౌండేషన్ చైర్మన్ వీణం. శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మేమున్న సేవా సంస్థ చేస్తున్న సేవలు గూర్చి ఆర్డీవో స్వాతికి వివరించారు. తహసీల్దార్ కూనప రెడ్డి. అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మన్నెం గోపాలరావు, టౌన్ ప్లానింగ్ అధికారిణి బళ్ళ. సృజన కుమారి,సభ్యులు మేడక కిషోర్, నల్ల సాయిబాబు, సాయి, పట్టిసపు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సహాయకుల భర్తీకి దరఖాస్తులు

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండలంలోని ధూళిపూడిపాలెం లో అంగన్వాడీ సహాయకరాలు ఖాళీ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పామర్రు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి వి.భానుశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా సదరు దరఖాస్తుదారులు వివాహితులైన మహిళా అభ్యర్థులు, పదవ తరగతి పాస్ కావాలని 21 సంవత్సరాల నిండాలని నివాస ధ్రువీకరణ పత్రం ఆధార్, పాన్ కార్డు లు తప్పని సరిగా ఉండాలని అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను 17-5-25 సాయంత్రం 5గం,,లోపు పామర్రు లోని ఐసిడిఎస్ కార్యాలయం లో అందజేయాలని తెలిపారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర -కూచిపూడి : కూచిపూడి లోనే రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయం ప్రాంగణంలో మొవ్వ మండల రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని తహసిల్దార్ కే మస్తాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిలికానాంధ్రసంజీవిని వైద్యాలయం పరిపాలన అధికారి జొన్నలగడ్డ హనుమ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వమండల చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, మొవ్వ. ఏ.ఎం.సీ. చైర్మన్ దోనేపూడి శివరామయ్య, సభ్యులు మద్దాల కామేశ్వరరావు పాల్గొన్నారు.

పామర్రులో భారీ వర్షం

విశాలాంధ్ర,పామర్రు : పామర్రులో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో ప్రధాన రహదారి నీటితో నిండింది. వర్షపు నీరు పోవడానికి స్పందించకపోవడంతో గంటల తరబడి వర్షపునీరు ప్రధాన రహదారిపై తిష్ట వేయడంతో వాహన దారులు పాదచారులు ఇబ్బంది పడ్డారు.

వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించిన మూడు మండలాలు జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు కు చెందిన 131 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు,లెవెలింగ్ బ్లేడ్లు తదితర యంత్ర సామాగ్రిని జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమమని తెలిపారు. రైతుల వివరాలు పరిశీలించిన తర్వాత నగదు జమ చేస్తారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కాచవరం కాలువ ఎక్స్ చైర్మన్ యానాల గోపి, నంబూరి శ్రీనివాసరావు, వేదాద్రి సర్పంచి పేరయ్య, మాజీ సర్పంచి జగజీవన్, జగ్గయ్యపేట ఏడిఏ సి భవాని మూడు మండలాల వ్యవసాయ అధికారులు మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నెలలో రెండు రోజులు 'సమాజసేవ' : రాంజీ

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జూన్ విద్యా సంవత్సరం నుండి ప్రతి నెలలో రెండు రోజులు విద్యార్థులు, అద్యాపకులు పూర్తిగా సమాజసేవ కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. రాంజీ ప్రకటించారు. జాతీయ మారిటైమ్ దినోత్సవం సందర్భంగా నావెల్ అకాడమీతో కృష్ణా విశ్వవిద్యాలయం చేసుకున్న ఒప్పందంలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం నుండి నూతన కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బాధ్యత గల పౌరులుగా జీవించాలంటే సమాజసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ ఏపిఎస్సీ చైర్మన్ ఆచార్య ఎంఎల్ఎస్ దేవకుమార్, మజ్జిగాన్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్ చందు సాంబశివ రావు, ఐఈఐ ఏపిఎస్సీ కార్యదర్శి ఆచార్య నరేష్ బాబు పాల్గొన్న గూగుల్ మీట్లో ఇండియన్ నేవీ కమాండర్ ఆదేశీ పాల్ సింగ్, డా. ఉజ్వల్లు పాల్గొని మాట్లాడారు. కెయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా. రాంబాబు, సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు, తొలి నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సర్ హెన్రీడ్యునాంట్ జయంతి వేడుకలను రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఇవాళ అర్పించారు. ముఖ్య అతిధిగా తహసీల్దార్, మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు కె మస్తాన్ పాల్గొని పమిడిముక్కల మండలం లోనిగురజాడ తో పాటు తోట్లవల్లూరు మండలంలోని నార్త్ వల్లూరులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదానికి గురై సర్వస్వం కోల్పోయిన 5 కుటుంబాలకు వంటవద్దన స్టీల్ పాత్రలు, బకెట్స్,టార్పాలిన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్, రోటరీ క్లబ్ సభ్యులు కొండవీటి అమరబాలేశ్వరరావు, రెడ్ క్రాస్ జీవిత కాలపు సభ్యులు మద్దాల కామేశ్వరరావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

'కిల్కారీ'పై శిక్షణ



విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: కిల్కారీపై మండల వైద్యారోగ్య సిబ్బందికి అధికారులు గురువారం తెల్లదేవరపల్లి ఉన్నతస్థాయి ఆరోగ్యకేంద్రంలో శిక్షణనిచ్చారు. గర్భవతులు, బాలింతల రక్షణకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వారు తెలిపారు. గర్భవతైన మహిళ నాల్గవ నెల నుంచి బిడ్డ పుట్టి ఏడాది గడిచే వరకు నిరంతర పర్యవేక్షణ ఈ కార్యక్రమ లక్ష్యంగా వివరించారు. సదస్సులో కార్యక్రమ ప్రత్యేకాధికారి రాజు, వైద్యాధికారులు డా.కె.శ్రీనివాసరావు, డా.నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది రూతమ్మ, శ్రీలత, శివకుమారి, జయబాబు, మండలంలోని వైద్యశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్ యూనివర్సిటీలో ప్రారంభమైన ఇంజనీరింగ్ కౌన్సిలింగ్

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికై కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కౌన్సిలింగ్‌కు హాజరైై వివిధ బ్రాంచీలలో ప్రవేశాలను తీసుకున్నారు. కేఎల్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షలో 3వ ర్యాంకు పొందిన ఆళ్ళ వెంకట సాయి అఖిల్‌కు, క్రీడల విభాగంలో జీగ్నేష్‌కు సీఎస్‌ఈ విభాగంలో 50 శాతం ఫీజు రాయితీతో యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సెలర్ డాక్టర్ కె.రాజశేఖర రావు, కౌన్సిలింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జగదీష్, కన్వీనర్ డాక్టర్ సుమన్, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు అధికారికంగా ప్రవేశాలను విద్యార్థులకు అందించారు. ఉదయం నుంచి ప్రారంభమైన కౌన్సిలింగ్ లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా కింద విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 11వ తేదీ ఆదివారం వరకు కౌన్సిలింగ్ జరుగుతుందని, కేఎల్ ఇంజ నీరింగ్ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యా ర్థులతో పాటు ఓపెన్ కేటగిరి కింద మెరిట్ విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నారు. జేఈఈలో అత్యుత్తమ పర్సంటైల్ పొందిన విద్యార్థులకు కూడా మెరిట్ స్కాలర్‌షిప్స్ ద్వారా అడ్మిషన్స్ పొందవచ్చని చెప్పారు.

తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి మా భూమిని ఆక్రమించారు

- మాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-మంగళగిరి : తమ పేరుపై ఉన్న పొలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించడమే కాకుండా అదేమని అడిగితే దాడులకు దిగుతున్నారని నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం ఏటూరు గ్రామానికి చెందిన పలువురు వాపోయారు. ఈ మేరకు వారు గురువారం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరణం శ్రీనివాస్ అనే వ్యక్తి మాట్లాడుతూ తన తండ్రి చిన్నయ్యకు 231 సర్వే నంబర్‌లో సుమారు ఎకరం ఎనభైన్నర సెంట్లు, సర్వే నెంబర్ 230/2లో ఎకరం 40 సెంట్లు పొలం ఉందన్నారు. సదరు ఆస్తి తన తండ్రి మరణానంతరం తనకు సంక్రమించిందని తెలిపారు. సదరు పొలాన్ని అదే ప్రాంతానికి చెందిన పలువురు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించారని ఆరోపించారు. తమ పొలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేశామని అయినా పట్టించుకోవడంలేదని తమకు న్యాయం చేయాలని కోరారు. విచారించి తమ సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటు న్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు చొరవచూపి తమ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. కరణం భారతి, నవనీతం వరి మహేష్ ఉన్నారు.

మరుగుదొడ్లన్నీ అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని మరుగుదొడ్లన్నీ ప్రజలకు అందుబాటులో ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కమిషనర్ గురువారం పర్యటనలో భాగంగా భవానిపురం, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, హెచ్‌బి కాలనీ, సివిఆర్ ఫ్లైఓవర్ ప్రాంతాల్లో పర్యటించి మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, ప్రజారోగ్యం సిబ్బంది సమన్వయంతో మరుగుదొడ్లు ఎక్కడైనా మరమ్మతులు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, మరుగుదొడ్ల నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లోని స్మార్ట్ స్ట్రీట్‌లో 200 మీటర్ల విస్తీర్ణంలో 40 వీధి విక్రయదారులకు నేషనల్ అర్బన్ లైవ్‌లీవుడ్ మిషన్‌లో భాగంగా అభివృద్ధి చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్‌ను ఆహ్లాదకరమైన వాతావరణంతో అందుబాటులోకి తీసు కొచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికా రులను ఆదేశించారు. అనంతరం హెచ్‌బి కాలనీలోని అన్నా క్యాంటీన్ ను పరిశీలించి అక్కడున్న ప్రజలతో మాట్లాడి అన్న క్యాంటీన్ సమయానికి తెరుస్తున్నదీ లేనిదీ, ఆహార నాణ్యత ఎలా ఉంది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని డ్రెయిన్ల డీసిల్టింగ్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సూపరిండెంటింగ్ ఇంజనీర్ పి సత్యనారాయణ, జాయింట్ డైరెక్టర్ లత, యూసీడీ పీవో వెంకటనారాయణ పాల్గొన్నారు.

సీపీఐ నారాయణపురం కార్యదర్శిగా ప్రత్తిపాటి

విశాలాంధ్ర-దాచేపల్లి: సీపీఐ నారాయణ పురం కార్యదర్శిగా ప్రత్తిపాటి వెంకట నాగరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో శాఖ సభ్యుల సమావేశం నిర్వహించారు. అందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనిలో భాగంగానే కార్యవర్గ సభ్యులుగా బుర్రి కృష్ణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, వేముల వెంకటరెడ్డి, తమ్మిశెట్టి శ్రీరాములు, బుర్రి ర్యూనీ తదితరులు నియమితులయ్యారు.

సీపీఐ రోశయ్య కాలనీ కమిటీ కార్యదర్శిగా రేపూరి

విశాలాంధ్ర-దాచేపల్లి: ప్రత్తిపాటి రోశయ్య కాలనీ దాచేపల్లి విభాగం సీపీఐ కమిటీ కార్యదర్శిగా రేపూరి రామయ్య ఎంపికయ్యారు. ఈమేరకు గురువారం ఈశాఖ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దీనిలో భాగంగానే సహాయ కార్యదర్శిగా నేరెళ్ళ కొండలు, కోశాధికారిగా షేక్ మహబూబ్ జానీ, కార్యవర్గ సభ్యులుగా బత్తుల నాసరయ్య, బాణావతు సైదానాయక్, షేక్ సుభానీ, ఈసూబ్‌బేగ్, ఇందిర, అంజలిలను ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర- గుంటూరు సిటీ: గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 57వ డివిజన్ బసవతారక రామ నగర్‌లో 39.80లక్షల రూపాయలతో, 54వ డివిజన్ రాజేశ్వర రావు కాలనిలో 31.70 లక్షల రూపాయలతో, 50వ డివిజన్లోని మల్లిఖార్జునపేట 2వ లైన్ నందు 19.50 లక్షల రూపాయలతో సి.సి రోడ్లు మరియు డ్రైన్లు నిర్మించుటకు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నజీర్ అహ్మద్‌తో కలిసి గురువారం మేయర్ కోవెలమూడి రవీంద్ర శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డిప్యుటి మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు పఠాన్ నూర్జహాన్, మల్లవరపు రమ్య, ఈరంటి వరప్రసాద్, నగరపాలకసంస్థ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : మండలాలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. మంగళగిరి పట్టణంలోని 22వ వార్డుకు చెందిన గోలి అరుణకు రూ.2,54,441 సూర్యనారాయణ నగర్‌కు చెందిన ఆదిమల్ల చిట్టెమ్మకు రూ.81 వేలు, మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన చదలవాడ లక్ష్మీ సుధాకు రూ.1.50 లక్షలు, క్రాప కోటేశ్వరావుకు రూ.1,30 లక్షలు విలువైన చెక్కులు అందజేశారు. చెక్కులు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్లకి సహాయంగా ముఖ్యమంత్రి సహాయనిధి విడుదల చేయడంతో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్, 22వవార్డు అధ్యక్షులు కాసిన కొండలరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్ర కోటేశ్వరావు, కాకాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

11న గుంటూరులో అమిగోస్ మ్యూజికల్ కన్సర్ట్ 5వ సంగీత విభావరి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అమిగోస్ మ్యూజికల్ కన్సర్ట్ 5వ సంగీత విభావరి ఈ నెల 11వ తేదిన గుంటూరులో నిర్వహిస్తున్నట్లు అమిగోస్ మ్యూజికల్ కన్సర్ట్ చైర్మన్ పి.రవీంద్రబాబు తెలియజేశారు. గుంటూరు రెవెన్యూ కళ్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంగీత విభావరి వివరాలు ఆయన వెల్లడించారు. రెవెన్యూ కళ్యాణ మండపంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక నుంచి ప్రత్యేక గాయని గాయకులు గాన గంధర్వుడు పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యంను స్మరించుకుంటూ మధుర గీతాలను ఆలపిస్తారని తెలిపారు. గాయని గాయకులను ప్రోత్సహించడం కోసం వివిధ రాష్ట్రాలలో జిల్లాల వారీగా ప్రదర్శనలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే మూడు రాష్ట్రాలలో నాలుగు అతి పెద్ద ప్రదర్శనలు నిర్వహించామని వివరించారు. విద్య, వైద్య రంగంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయం చేస్తూ సమాజ శ్రేయస్సుకు అమిగోస్ దోహదపడుతుందని చెప్పారు. ఈ సమావేశంలో అమిగోస్ ట్రెజరర్ బి.పృథ్వి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జానీ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో విబియస్ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక ఇమ్మానుయేల్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణం లోని వివిధ సంఘాలకి చెందిన, గ్రామీణ చర్చస్ నుండి సండే స్కూల్ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో విబిఎస్ తరగతులకి హాజరయ్యారు. సండే స్కూల్ విద్యార్థులకు విరామ బైబిల్ పాఠశాలలో ఆత్మీయ దేవుని మాటలు, పాటలు, స్కిట్స్ పప్పెట్ షోస్ నేర్పించుటకు హైదరాబాద్ నుండి పందుల ఏమిలి గ్రేస్ హాజరయ్యారు. కార్యక్రమంలో అధ్యక్షులు సీహెచ్ రామయ్య, సెక్రెటరీ జి. ఆశీవదనం, ట్రెజరర్ పి. సునీల్ కుమార్, వైస్ సెక్రెటరీ కె. వినోద్ కుమార్, పాస్టరమ్మా మేరీ షారోన్, సండే స్కూల్ సూపరిండెంట్ మేరీ రత్నం, టీచర్లు, స్త్రీల కమిటీ ప్రెసిడెంట్ వై సునీత, సెక్రెటరీ కె. ఆశలత జీవన్, వైస్ సెక్రెటరీ మ్ విజయ,స్త్రీల కమిటీ వారు,సంఘ పెద్దలు, సంఘస్తులు, పాల్గొన్నారు.

ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం కమిటీ నియామకం

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లి పట్టణ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం కమిటీ నియా మకం జరిగింది. అధ్యక్షులుగా పులేపు భాస్కరరావు, యూత్ అధ్యక్షుడిగా నక్క నవీన్‌రాజా, యూత్ సెక్రెటరీగా పూడి రమణ, ట్రెజరర్‌గా తాడి కొండనాగేశ్వరరావు, యూత్ ప్రచార కార్యదర్శిగా అడపానరేష్, యూత్ జాయింట్ సెక్రెటరీగా అల్లుసాయి చక్రపాణి, జాయింట్ ప్రచార కార్యదర్శిగా కేసురెడ్డి మురళీకృష్ణ, జాయింట్ సెక్రెటరీగా గాజుల వీర కృష్ణ, తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులుగా వలివేటి రమేష్ కుమార్, కార్యదర్శిగా కొత్తూరు వెంకట మోహన్‌రావు, యూత్ జాయింట్ సెక్రెటరీగా వీరిశెట్టి వెంకటేశ్వరరావులను తాడేపల్లి పట్టణ ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో తోట కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

వద్రాణం హరిబాబు నాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన నిమ్మల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇటీవల గుంటూరు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన వద్రాణం హరిబాబు నాయుడుని గోరంట్లలోని వారి నివాసం నందు 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వద్రాణం హరిబాబు నాయుడుని కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనం తరం శాలువాతో ఘనంగా సత్కరించారు. వెంకట రమణ మాట్లాడుతూ సహకర మార్కెటింగ్ వ్యవస్థను వద్రాణం హరిబాబు మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. వద్రాణం హరిబాబు నాయుడును కలిసిన వారిలో జనసేన నాయకులు యర్రగోపుల జయదీప్, పవన్ తదితరులు ఉన్నారు.

సేవలను విస్తృతపరిచేందుకే వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగర పాలక సంస్థకు సంబంధించి ప్రజలకు అందించే సేవలను విస్తృతంగా, వేగంగా అందు బాటులో ఉంచేలా అధికారిక వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్‌ను రూపొందిం చామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరం నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జీఎంసీ వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎక్కువమంది నగర ప్రజలు వినియోగించుకొని నగరపాలక సంస్థ సేవలు పొందేలా వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్స్ ఉండేలా రూపొందించడం జరిగిందన్నారు. అలాగే ప్రజలు అన్ని రకాల పిర్యాదులు, సేవలను పొందేందుకు మన జీఎంసీ మొబైల్ యాప్‌ను, జీఎంసీ అధికారులకు పరిపాలన సౌలభ్యం కోసం జీఎంసీ కనెక్ట్, ప్రజలు విరివిగా, తేలికగా జీఎంసీ సేవలను పొందేందుకు జీఎంసీ వాట్సప్ చాట్ బోట్, విభాగాధిపతులు క్షేత్ర స్థాయి సిబ్బందికి సంబంధించి టాస్క్ మేనేజర్‌లను సమగ్రంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు ప్లేస్టోర్ నుంచి ఆయా మొబైల్ అప్లికేషన్స్‌ను డౌన్‌లోడ్ చేసుకొని జీఎంసీ సేవలను వేగంగా అందుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక అరండల్‌పేట తాలూక ఆవరణలో ఉన్న రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ హాలు నందు పదవ తరగతిలో500 మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, జ్ఞాపికల బహుకరణల కార్యక్రమం వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీకృష్ణ అకాడమీ వారి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఎక్సైజ్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినీ, విద్యార్థులకు నగదుతో పాటు మెమొంటో, సర్టిఫికెట్స్‌లను కూడా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండి చదువులో రాణిస్తూ మంచి ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. ఇష్టంతో చదువు చదివి మంచి భవిష్యత్తు పొందాలన్నారు. ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ భవిష్యత్‌ను విలాసవంతంగా గడపాలంటే తొలుత విద్యతో ఉన్నత శిఖరాలు సాధించిన నాడే భవిష్యత్‌లో జీవితాన్ని విలాసవంతంగా గడపొచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాసరావు యాదవ్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్, పాశం సర్దార్ అభినంద్ యాదవ్, కోనంకి మురళీకృష్ణ యాదవ్, అలా లక్ష్మీప్రసన్న, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ కిరణ్మయి దేవిరెడ్డి, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శరత్‌బాబు, టీచర్లు నరసింహారావు, సాదం సత్యనారాయణ, అనంగి శ్రీనివాస్, రాణి రుద్రమదేవి, శ్రీకృష్ణ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం తహశీల్దార్‌ను ఘెరావ్ చేసిన మహిళలు

- మారుతి చొరవతో సమస్యకు పరిష్కారం

విశాలాంధ్ర-కారంపూడి: పట్టణంలోని ఆదినారాయణ కాలనీ మహిళలు రేషన్‌బియ్యం కోసం తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌ను గురువారం ఘెరావ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి రేషన్ బియ్యం యివ్వడం లేదని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి వరప్రసాద్ వద్ద మహిళలు వాపోయారు. తక్షణమే స్పందించిన మారుతి ఫోన్ ద్వారా మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వివరించి తహశీల్దార్ పంప వలసినదిగా కోరారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ వచ్చిన తరువాత ఆయనకు సమస్య తీవ్ర తను మారుతి వివరించారు. మహిళలు మాట్లాడుతు ఆదినారాయణ కాలనీలో ఇంతవరకు రేషన్‌బియ్యం యివ్వలేదని, బియ్యం అడిగితే డీలర్ డబ్బులు యిస్తామంటున్నాడని తెలిపారు. మాకు డబ్బులు వద్దని, బియ్యం కావాలని మహిళలు తహశీల్దార్‌ను డిమాండ్ చేశారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ డీలర్‌ను పిలిపించి మందలించారు. వెంటనే కార్డుదారులకు రేషన్ యివ్వాలని ఆదేశించారు. కార్డుదారులకు రేషన్ యివ్వని డీలర్లనను తొలగిస్తామని మహిళలకు హామీ యిచ్చారు. సమస్య తెలిసిన వెంటనే స్పందించి పేదప్రజల పక్షాన నిలబడి సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్‌ను మహిళలు అభినందించారు. కార్య క్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డి, రెంటచింతల మండల కార్యదర్శి కేతావతు రంగనాయకులు, కారంపూడి మండల కార్యదర్శి షేక్ సైదా పాల్గొన్నారు.

పెరిగిన కౌలు ధరలు

విశాలాంధ్ర-తాడికొండ : ఏడాది కౌలు ధరలు స్వల్పంగా పెరిగాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.1000 నుంచి రూ.4 వేల వరకు ధరలు పెరిగాయి. తాడికొండ పరిసరాలలో వాణిజ్య పంటలు పండే మెట్ట భూమి ఎకరా గతంలో రూ.13 వేలు ఉండగా నేడు రూ.16 వేలకు చేరింది. పొన్నెకల్లు, రావెల, పాములపాడు, దామరపల్లి, గరికపాడు, బండారుపల్లి పరిసర గ్రామాలలో సైతం మెట్ట భూముల కౌలు ధరలు పెరిగాయి. పంట కాలువలకు దగ్గరగా ఉండే భూములకు సైతం రెక్కలు వచ్చాయి. గతంలో రూ.16 వేలు ఉన్న మిర్చి పండించే భూముల ధరలు నేడు రూ.20 వేలకు పైబడి చేరింది. ధాన్యం పండించే మాగాణి ఎకరా రూ.16 వేలకు చేరింది. వడ్లు అయితే 12 బస్తాలు కౌలు జరుగుతుంది. ఈ ఏడాది స్వల్పంగా కౌలు ధరలు పెరిగాయి.

ఇస్లాంలో అత్యంత పవిత్రమైనది హజ్ యాత్ర

విశాలాంధ్ర-దాచేపల్లి: గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు ఆధ్వర్యంలో గురువారం దాచేపల్లిలో ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని మాచవరం, దాచేపల్లి నుంచి ముగ్గురు దంపతులు హజ్ యాత్రకు వెళ్తున్నారు. రూ.లక్ష చొప్పున ముగ్గురు దంపతులకు ఆయన రూ.3 లక్షల నగదు సాయం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ హుస్సేన్ బాషా, రాష్ట్ర మైనార్టీ కార్పోరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీడీపీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ హజ్ యాత్ర అనేది ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన పుణ్య యాత్ర అన్నారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆరేటి, దేవరకొండకు ప్రత్యేక ఆహ్వానం

విశాలాంధ్ర-పొన్నూరు: ఐఎస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సిఈవో, కళారత్న డా.కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ నెల 10, 11 తేదీలలో ఏలూరులో ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు జరగనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రపంచ తెలుగు సాహిత్య సబరాలకు పొన్నూరుకు చెందిన ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆరేటి రామారావు, గుంటూరు జిల్లా కార్యదర్శి గేయ రచయిత దేవరకొండ శ్రీనివాసరావులను ప్రత్యేకంగా ఆహ్వానించినట్టు విలేకరుల సమావేశంలో ఆరేటి రామారావు తెలిపారు. తెలుగు భాష, సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ, కవులను రచయితలను కళాకారులను ప్రోత్సాహిస్తూ నిరవధికంగా 48 గంటల వరల్డ్ రికార్డు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, ప్రోగ్రాం కన్వీనర్, రిటైర్డ్ డిఐఓ (గిరిజన సంక్షేమశాఖ) డా.టి.పార్థసారథి ఆధ్వర్యంలో, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీ భూషణం, జాతీయ కమిటీ పర్యవేక్షణలో ఏలూరులో మే నెల 10, 11 తేదీలలో మహాలక్ష్మి గోపాల స్వామి కళ్యాణ మంటపం నందు జరుగుతున్నవన్నారు. ఇప్పటికే 1000 మంది కవులు, కళాకారులు పేరు నమోదు చేసుకున్నారని, కవులు, రచయితలు కళాకారులు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రపంచతెలుగు కవితోత్సవం, జాతీయ సాహిత్య సదస్సు, పుస్తకావిష్కరణలు, మిమిక్రీ, నాట్యాలు, నాటకాలు, కూచిపూడి, భరతనాట్యం, రంగస్థల కళాకారుల ప్రదర్శనలు జరుగుతాయన్నారు.

CHANGE OF SURNAME

I, **SRAVAN KUMAR J** (Old Name), S/o. **J Balu**, Resident of Flat No: 502, Palm Grove Apartment, 2nd Line, Santosh Nagar, Near Srividya School, Guntur, Guntur District - 522004, Andhra Pradesh. I have changed my surname as **JATAVATH SRAVAN KUMAR** (New Name) S/o. **J Balu**. Hereafter my surname is known as **JATAVATH SRAVAN KUMAR** (New Name) S/o. **J Balu**.

CHANGE OF NAME

I, **BAALI SHAHEED** (Old Name), S/o. **Shaik Subhani**, Resident of Door No: 17-2-3/232, Golusu Kondala Rao Nagar, 2nd Line, Guntur, Guntur District - 522001, Andhra Pradesh. I have changed my name as **SHAIK BALI SHAHEED** (New Name) S/o. **Shaik Subhani**. Hereafter my name is known as **SHAIK BALI SHAHEED** (New Name) S/o. **Shaik Subhani**.

CHANGE OF SURNAME

I, **REHANA** (Old Name), W/o. **Shaik Bali Shaheed**, Resident of Door No:17-2-3/232, Golusu Kondala Rao Nagar, 2nd Line, Guntur, Guntur District - 522001, Andhra Pradesh. I have changed my surname as **SHAIK REHANA** (New Name) W/o. **Shaik Bali Shaheed**. Hereafter my surname is known as **SHAIK REHANA** (New Name) W/o. **Shaik Bali Shaheed**.

CHANGE OF SURNAME

I, **VEERA VENKATA SATYA MADAN GOPAL SANKAAMANCHI** (Old Name), S/o. **Sankaramanchi Ramachandra Rao**, Resident of Flat No: 504, Sai Sneha Residency, 3rd Line, Santhi Nagar, Guntur, Guntur District - 522004, Andhra Pradesh. I have changed my surname as **VEERA VENKATA SATYA MADAN GOPAL SANKARAMANCHI** (New Name), S/o. **Sankaramanchi Ramachandra Rao**. Hereafter my surname is known as **VEERA VENKATA SATYA MADAN GOPAL SANKARAMANCHI** (New Name), S/o. **Sankaramanchi Ramachandra Rao**.

CHANGE OF NAME

I, **Bhemireddy Lakshmi Rajyam** (Old Name), W/o. Bhimireddy Srinivasa Reddy, residing at # 4-149, Mangalagiri, Nidamarru,Guntur District, A.P.-522503 I have changed my name to **Bhimireddy Lakshmi Rajyam (New Name)**. Hence forth I will be known as **BHIMIREDDY LAKSHMI RAJYAM**

CHANGE OF NAME

I, **Bhemireddy Srinivasa Reddy** (Old Name), S/o. Bhimireddy Venkateswara Reddy, residing at # 4-149, Mangalagiri, Nidamarru,Guntur District, A.P.-522503 I have changed my name to **Bhimireddy Srinivasa Reddy (New Name)**. Hence forth I will be known as **BHIMIREDDY SRINIVASA REDDY**

ఆటో డ్రైవరే సూత్రధారి...!

- **కోటేశ్వరరావు హత్య కేసులో పురోగతి**
- **నలుగురు నిందితులను గుర్తించిన పోలీసులు**
- **గంటన్నర వ్యవధిలోనే కేసును చేధించిన మంగళగిరి గ్రామీణ ఎస్సై**

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండల పరిధి పెదవడ్లపూడి, చిలువూరు, గ్రామాల పరిధిలో బుధవారం రాత్రి జరిగిన కోటేశ్వరరావు(47) హత్య కేసులో ఓ ఆటో డ్రైవర్ ప్రధాన సూత్రధారిగా తేలినట్లు చెబుతున్నారు. ఈ కేసులో మొత్తం నలుగురు నిందితులు ఉన్నట్లుగా పోలీసులు నిర్ధారించినట్లుగా తెలుస్తోంది. సదరు నిందితులను తమ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం మంగళగిరి కార్పొరేషన్ పరిధి నవులూరు టిడ్కో గృహ సముదాయంలో నివాసముండే కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. ఈ నేపథ్యంలో కోటేశ్వరరావు యాచనకు అలవాటు పడి హిజ్రా వేషాన్ని ధరించాడు. ఇంట్లో ఉన్న సమయంలో సాధారణంగానే జీవనం సాగిస్తూ ఉంటాడు. రేవేంద్రపాడు వద్ద ఓ గదిలో దుస్తులు మార్చుకొని హిజ్రా అవతారం ఎత్తుతూ ఉంటాడు. హిజ్రా వేషధారణలో ఉన్న కోటేశ్వర రావు మోరంపూడి, చిలువూరు, కొప్పురావూరు గ్రామాలలో యాచిస్తూ, ప్రతి శుక్ర వారం తెనాలిలో తన కార్యకలాపాలు కొనసాగిస్తుంటాడు. ప్రతి రోజు సుమారు రూ.2 వేల వరకు సంపాదిస్తుంటాడు. రఫీ అలియాస్ నర్మదా అనే మహిళతో పరిచయం ఏర్పడింది. కోటేశ్వర రావు నర్మద కలిసి తిరుగుతున్న క్రమంలో నర్మదకు ఓ ఆటో డ్రైవర్‌తో పరిచయం ఏర్పడుతుంది. ఈ పరిచయం కాస్త శారీరక సంబంధంగా మారింది. ఈ వ్యవహారాన్ని కోటేశ్వరరావు ఆటో డ్రైవర్ భార్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. తమ సహజీవనానికి అడ్డు రావడంతోపాటు సంపాదనలోనూ పోటీ పడుతున్నాడు అన్న అక్కసుతో ఆటో డ్రైవర్ కోటేశ్వరరావును హతమార్చాలని పథకం పన్నాడు. ఈ పథకంలో భాగంగా బుధవారం రాత్రి కాపు కాసి చిలువూరు వద్ద మరో ముగ్గురితో కలిసి అటుగా వస్తున్న కోటేశ్వరరావును అడ్డగించి, నరికి హత్య చేశారు. ఆటో డ్రైవర్ సైతం హిజ్రా వేషంలో ఉన్న వ్యక్తి కావడం గమనార్హం.

కేవలం గంటన్నర వ్యవధిలోనే కేసు చేధించిన పోలీసులు: ఈ కేసులో ప్రాథమికంగా ఆధారాలు ఏవి లభ్యం కానప్పటికీ రూరల్ పోలీసులు గంటన్నర వ్యవధిలోనే కేసును చేదించినట్లుగా తెలుస్తోంది. రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ దర్యాప్తు చేపట్టి కేసులో పురోగతిని కనబరిచారు. మొత్తం నలుగురు నిందితులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితులు నలుగురు తెనాలికి చెందిన వారుగా నిర్ధారించారు. ఈ నెల 9న మీడియా ముందు నిందితులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర- పెదకూరపాడు: సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి పెదకూరపాడు నియోజకవర్గం లోని వివిధ అంశాలకు సంబంధిం చిన పరిస్థితులను వివరించినట్టు పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ గురువారం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు.

సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే స్థల పరిశీలన

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పిడుగురాళ్లలో త్వరలో నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి ప్రభుత్వఅధికారుల సమీక్షా సమావేశానికి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరిశీలించారు. పట్టణంలోని ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ, ఎంపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రహదారి బంగ్లా ప్రదేశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో సమీక్ష సమావేశ నిర్వహణకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని కమిషనర్ పర్వతనేని శ్రీధర్ తహశీల్దార్ మధుబాబులకు సూచన చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ గ్రీవెన్స్ స్థాయి, రివ్యూ మీటింగ్ జరుగనుంది. ఎమ్మెల్యే వెంట పురపాలక చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మార్కెట్ యార్డు చైర్మన్ తురక వీరాస్వామి, పార్టీ నాయకులు కనిగిరి శ్రీనివాసరావు, పాండురంగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు ముస్తాబైన ఉన్నత పాఠశాల

విశాలాంధ్ర-పెదనందిపాడు : మండల పరిధిలోని పాలపర్రు గ్రామంలో శ్రీ నారసింహ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవాలు ఈ నెల 10వ తేది నుంచి నిర్వహించ దానికి వజ్రోత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2017లో రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సుజనా చౌదరికి గ్రామంతో ఉన్న అనుబంధంతో పాఠశాల అభివృద్ధికి రూ.11 లక్షల నిధులను మంజూరు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

11న ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర-పెదకూరపాడు: ఈనెల 11వ తేదీన పెదకూరపాడు ఆర్సియం స్కూల్ ఆవరణలో కొమర బత్తిన రోజమ్మ కారం శెట్టి జయరావు జ్ఞాపకార్థంగా పెదకాకాని శంకర్ కంటి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాకులు కేవల్ రాజు గురువారం ప్రకటనలో తెలిపారు. నియోజవర్గంలోని ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని, శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు తీసుకొని రావాలని తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగరు పరీక్షలను ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి శుక్లాలు గుర్తించి, కాకాని శంకర కంటి హాస్పటల్లో ఆపరేషన్ చేయనున్నట్లు, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం

- ఐక్యవేదిక చైర్మన్ చాంద్‌బాషా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : జూన్ 5న జరిగే రాష్ట్ర కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని ఐక్యవేదిక గుంటూరు జిల్లా చైర్మన్ సయ్యద్ చాంద్‌బాష ఉద్యోగులకు పిలుపునిచ్చారు. స్థానిక గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ)గుంటూరు జిల్లా కార్యాలయం నందు జిల్లా ఐక్యవేదిక గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్‌బాష మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆహ్వానించి నివేదిస్తామన్నారు. ఈ కౌన్సిల్ సమావేశా నికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ పోతురాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, కోటా సాహెబ్, జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు విజయబాబు, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, రాధాకృష్ణ, నగరశాఖ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదరత్తయ్య, నగరశాఖ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, రోజారాణి, నీలిమా, షబానా సుల్తానా, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిత్య చైతన్య దీప్తి 'డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య

- పట్టాభి కాంస్య విగ్రహావిష్కరణలో ఇండియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ జవహర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్వాతంత్ర సమరయోధునిగా, గాంధీజీ శిష్యునిగా, స్వాతంత్రానికి పూర్వమే ఆంధ్ర బ్యాంక్‌తో పాటు అనేక ఆర్థిక, భీమ సంస్థలను స్థాపించి తెలుగువారి కీర్తిని దశ దిశల చాటిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య బ్యాంకు ఉద్యోగులతో పాటు తెలుగు వారందరికీ చిరస్మరణీయులని యూనియన్ బ్యాంక్ రీజియన్ హెడ్ సయ్యద్ జవహర్ కొనియాడారు. ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు, నరసరావుపేట రీజియన్స్‌ల ఆధ్వర్యంలో స్థానిక హిందూ కాలేజీ యూనియన్ బ్యాంక్ వద్ద డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య కాంస్య విగ్రహాన్ని రీజియన్ హెడ్ జవహర్ తో పాటు ఆంధ్ర, యూనియన్ బ్యాంక్ విశ్రాంత అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలు వేసి డాక్టర్ భోగరాజు అమర్ రహే, లాంగ్‌లివ్ వంటి నినాదాలతో ఘనంగా ప్రారంభించారు. అనంతరం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో జ్యోతి ప్రజ్వలన వావిలాల పి.పద్మ జాతీయ గీతాలాపన చేశారు. జవహర్ మాట్లాడుతూ డాక్టర్ భోగరాజు స్పూర్తితో రిటైరీస్, మహిళలు, విద్యార్థుల కోసం కొత్త పథకాకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆల్ ఇండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడ రేషన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కృష్ణమూర్తి వి వారణాసి మాట్లాడుతూ పారిశ్రామిక రాజకీయ ఉద్దండులు ముళ్ళపూడి హరిచంద్ర ప్రసాద్, రాజగోపాల్ నాయుడు వంటి వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు సీతారామయ్య సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఎండి పి.శ్రీనివాస్, విజయ బ్యాంక్ మాజీ చైర్మన్ ఎండి బివిఎస్ రామారావు, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ అధ్యక్షులు బిబివి కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎల్లారావు, ఏబి ఆర్ఇఏ వైస్ ప్రెసిడెంట్ ఎన్.గణేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.కోటేశ్వరరావు, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ వై. హనుమంతరావు, ఎం.వి నిరంజన్ కుమార్, ఆర్ సుబ్బారావు, శివాజీ, సావనీర్ కమిటీ జిడివి ప్రసన్నత బాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన మహాప్రస్థాన కమిటీ సభ్యులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నూతనంగా గుంటూరు కార్పొరేషన్ మేయర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కోవెలమూడి రవీంద్రనాథ్(నాని)ను ఆయన కార్యాలయంలో మహాప్రస్థానం బొంగరాల బీడు గుంటూరు కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కమిటీ సభ్యులు కల్లూరు రమణయ్య, నిమ్మగడ్డ అంకమ్మ చౌదరి, జంగాలపల్లి పార్థసారథి, ధనియాల గాంధీ, మళ్ళమూరి మాలకొండయ్య, ఏలూరు నాగేశ్వరరావు, పీవీ సుబ్రహ్మణ్యం(మణి), కూనల మాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పోట్లూరులో వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం

విశాలాంధ్ర - వినుకొండ : ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన ప్రత్యేక పూజలు వినుకొండ నియోజక వర్గం, శావల్యాపురం మం డలం, పోట్లూరులో దేవతామూర్తుల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీమహాగణపతి, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, శివలింగ, నందీశ్వర విగ్రహాలు, శిఖర కలశీ, శిలా ధ్వజస్తంభం ప్రతిష్ఠింపజేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు హాజరయ్యారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు వీరికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా యంత్ర స్థాపన చేసిన అనం తరం ఆలయంలో దేవతా మూర్తుల విగ్రహాలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జీవీ, మక్కెన మల్లికార్జునరావు దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వేసవి సెలవులు సందర్భంగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను తమ పిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని మహిళా బాలల గ్రంధాలయం అధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీషలు తల్లిదండ్రులను కోరారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయం నందు వేసవి విజ్ఞాన తరగతులు గురువారం పదవరోజు కొనసాగుతున్నాయి. పొడుపు కథలు, జీకె, కథలు చెప్పడం, కలరింగ్, పేపర్ క్రాఫ్ట్, పుస్తక పఠనం, పద్యాలను విద్యార్థినీ, విద్యార్థులచే గ్రంథాలయ అధికారులు చెప్పించారు. గ్రంధాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటను కాపాడుకోబోయి గాయాలైన రైతు

విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల కేంద్రమైన దుగ్గిరాల గ్రామంలో మధ్యాహ్నం 30 నుంచి 50 ఎకరాల వరకు రైతులు మొక్క జొన్న పంట పొలంలో ఉండిపోయింది. ఒక్కసారిగా వాతావరణంలో గాలి దుమారం రావడం తద్వారా మంటలు చెలరేగి పంట మొత్తం కాలిపోవడం జరుగుతూ ఉన్న విష యం తెలుసుకున్న టీడీపీ పార్టీ శ్రేణులు, తెలిసిన వెంటనే మంగళగిరి నియోజకవర్గ తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం అధ్య క్షులు టిఎన్‌యుఎస్ వల్లూరు నరసింహ రావు సమాచారం అందడంతో అందు బాటులో ఉన్న దుగ్గిరాల తెలుగు యువత నక్కా చిరంజీవి, పర్వతనేని హర్ష ,పేర్లే వంశీ, నవీన్ గౌడ్, కంచర్ల గోపాల్ వాసిరెడ్డి వినోద్, బొజ్జాబాలు యాదవ్, పాటిబండ్ల సాయి కిరణ్, తాడిశెట్టి వెంకటేశ్వరరావు తెలుగురైతు నాయకులు వాసిరెడ్డి సుధాకర్, వల్లూరు కోటేశ్వరరావులు వెంటనే పొలాల్లోకి వెళ్లి రైతులకు తమ వంతు సహాయ సహకారాలు అందించారు. తమ పొలంలో మొక్కజొన్న పంటన్ను కాపాడుకపోయి శరీరం కాలి గాయాలైన తాడిపోయిన నరసింహారావు గాయలతో బయటపడ్డారని స్థానికులు తెలియజేశారు.

12న మంగళగిరిలో బుద్ధపూర్ణిమ వేడుకలు

విశాలాంధ్ర-మంగళగిరి : 2569వ బుద్ధ జయంతిని పురస్కరించుకొని రాయల్ బంకెట్స్‌లో పాత్రికేయుల సమావేశం జరిగింది. తొలుత ఈ కార్యక్రమాన్ని మంగళగిరి బుద్ధ విహార వ్యవస్థాపకులు రేఖాకృష్ణార్జున రావు ప్రారంభించారు. ఈ నెల 12వ తేదీన బుద్ధపూర్ణిమ వేడుకలను మంగళగిరిలోని రాయల్ కన్వెన్షన్ మెగా ఫంక్షన్ హాల్‌లో వైభవంగా జరగనున్నట్లు మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు తెలిపారు. మానవతా వేదిక మీద ఈ సంవత్సరం 25వ బుద్ధ పూర్ణిమ వేడుకలను రజిత వేడుకలుగా నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షులు గుత్తికొండ ధనంజయరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజా హుస్సేన్ రచించిన కళలసిరి మంగళగిరి పుస్తకావిష్కరణ జరగనున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షులుగా వ్యవహరిస్తున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్తమాన సమాజానికి ఆవశ్యకత చాలా ఉందని మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని అభిప్రాయపడ్డారు. విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, పిరమిడ్ సీనియర్ మాస్టర్, ఆకురాతి శంకరరావు, ప్రజానాట్యమండలి కళాకారులు గాయకులు కంచర్ల కాశయ్య, సందుపట్ల భూపతి, అల్లక తాతారావు తదితరులు ఈ సమావేశాల్లో పాల్గొని మంగళగిరి పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ బుద్ధ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

విశాలాంధ్ర

పేదల ఆరోగ్యానికి వైద్య శిబిరాలు : ఎమ్మెల్యే మాధవి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలో ప్రతి ఒక్కరు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం స్థానిక సీతమ్మ కాలనీలో లలిత సూపర్ స్పెషాలిటీ వారి సౌజన్యంతో ఎమ్మెల్యే మాధవి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ మొదలు కొని థైరాయిడ్, స్త్రీ సంబంధిత సమస్యలకు నిష్ణాతులైన డాక్టర్లతో సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దైనందిన జీవితంలో పేదలు ఉరుకులు పరుగులు పెడుతూ, తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ఈ ఆరోగ్య సమస్యలు ఒకే సారి బయటపడిన సమయంలో తీవ్ర మానసిక, శారీరక, ఆర్థిక ఆందోళనకు గురవుతుంటారని, దీనిని ఆదిలోనే గుర్తించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్న లక్ష్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.విజయ, అప్పారావు యాదవ్, కసుకుర్తి హనుమంతరావు, బీజేపీ శివయ్య, మామిడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సిబార్ కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-పెదకాకాని : ఈ నెల 8వ తేదిన ప్రపంచ తలసేమియా దినోత్సవం పురస్కరించుకొని తక్కెళ్ళపాడు, గుంటూరులోని సిబార్ దంత వైద్య కళాశాలలో ఆర్థోడాంటిక్స్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి విచ్చేసి రక్తదాన శిబిరంను ప్రారంభించారు. అనంతరం వారు ప్రసంగిస్తూ ఇటువంటి గొప్ప సామాజిక కార్యక్రమాన్ని నిర్వహించినందుకు సిబార్ యాజమాన్యమును, అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. సిబార్ దంత వైద్య కళాశాలలో విద్య, వైద్య, పరిశోధన రంగాలలో చూపిస్తున్న ప్రగతిని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తలసేమియా బాధితులకు నెల నెలా పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రక్త దాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కలెక్టర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాల నిర్వహణలో సిబార్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 125 మంది విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది రక్తదానం చేశారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : మండల పరిధిలో గల చిన కొండ్ర పాడులో గోవింద మాంబ సమేత పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థానములో లోక కళ్యాణార్థం గురువారం శ్రీనివాసానంద స్వామీజీ ఆధ్వర్యంలో కళ్యాణోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గీతా సత్సంగ గురుపీఠం అధిపతులు కవి స్వరానంద స్వామి, సనాతన హిందూ ధర్మ సాధన పరిషత్ ఉపాధ్యక్షులు పూర్ణానంద స్వామి, మంగళగిరి పీఠాధిపతులు దయానంద దత్త స్వామి హాజరై కళ్యాణ వేడుకలు ఘనంగా జరిపించారు. కళ్యాణ వేడుకల అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. జెండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

10న కార్మిక సంఘాల జిల్లా సదస్సు జయప్రదం చేయండి : హనుమంతరావు

విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గ హక్కులను హరించి కార్పొరేట్ పారిశ్రామిక శక్తుల దోపిడీకి సహకరించే రీతిలో నాలుగు లేబర్ కోడ్‌లు అమలులోకి తేవాలని ప్రయత్ని స్తుందని యావత్ కార్మికవర్గం ఆందోళన చెందుతుందని ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావే శంలో హనుమంతరావు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 10వ తేదీన గుంటూరు నగరంలోని మల్లయ్య లింగం భవన్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరుగుతుందని, ఈ సదస్సును జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్మికులను పెట్టుబడు దారులకు ఊడిగం చేసే యంత్రాలుగా మార్చేం దుకే ఈ లేబర్ కోడ్‌లు ఉపయోగపడతాయని యావత్ కార్మిక వర్గం ఆందోళన చెందుతుం దని హనుమంతురావు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఈ కోడ్‌లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని ఆయన అన్నారు. సుదీర్ఘకాలం పాటు జరిగిన కార్మిక పోరాటాలు త్యాగాల ద్వారా సంపాదించుకున్న హక్కులను చట్టాలను కార్మిక వర్గం కోల్పోతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పని గంటలు కనీస వేతనాలు సామాజిక భద్రత భవిష్యత్తు ప్రశ్నార్థకరం కానున్నాయని ఆయన అన్నారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణలు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ కార్మికులను పెట్టుబడిదారులకు తాకట్టుపెడుతుందని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు వలన కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను చట్టాలను కోల్పోతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనం ఇవ్వకపోక ఫిక్స్‌టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ పేరుతో కార్మికులను దోపిడీ చేస్తుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోగా, కనీస వేతనం లేక, ఎనిమిది గంటల పని విధానానికి తిలోద కాలు ఇస్తున్నారని వారు అన్నారు. ఈ నెల 10వ తేదీన గుంటూరు జిల్లాలోని ఏఐటీయూసీ కార్యాల యంలో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని, అలాగే ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బాపనపల్లి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి

– ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుభాని

విశాలాంధ్ర-మాచర్ల: యువతకు ఉద్యోగాలు కల్పించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీని నిలబెట్టుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ కొమెరా వీరాస్వామి భవన్ లో గురువారం షేక్ సుభాని విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం దాదాపు 12 సంవత్సరాలు పైబడి అధికారంలో ఉన్నా, ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేక పోయారన్నారు. మోదీకి మిత్రులైన అంబానీ అదానీలకు దేశం లోని ప్రభుత్వ ఆస్తులన్నీ కట్టబెడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల 38 వేల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న నిరుద్యోగ యువత వ్యతిరేక విధానాలపైన పోరాటాలకు సిద్ధం కావాల న్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి నర్రా రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లి : కార్మిక వర్గ చట్టల రక్షణకై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, వైఎస్సార్‌టీ యూసీ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, ఐఎఫ్‌టీ యూ కార్మిక సంఘాల నాయ కులు కోరారు. గురువారం సాయంత్రం ప్రకాష్ నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులు తుడిమెల్ల వెంక టయ్య, ఏసీసీ నాయకులు స్టీవెన్ అధ్యక్ష తన ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికుల సమావేశం జరిగింది. ఏఐటీ యూసీ నాయకులు కంచర్ల కాశయ్య, సీఐటీయూ నాయకులు వేముల దుర్గా రావు, వైఎస్సార్ టీయూసీ నాయకులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభి స్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న స్కీం వర్కర్లు, ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించ దంలో నిర్లక్ష్యంగా ఉన్నదని, పారితోషకం పేరుతో ఆశ వర్కర్లను శ్రమదోపిడి చేస్తున్నదన్నారు. సీఐటీయూ నాయకులు బురగ వెంకటేశ్వరరావు, ఏఐటీ యూసీ నాయ కులుషేక్ బాషా, ఏఐఎఫ్ టీయూ న్యూ నాయకులు కె.ఆది నారాయణ, ఐఎఫ్‌టీయూ నాయకులు చెన్నయ్య, కార్మికులు కె.బాబురావు, కె.లక్ష్మీ రేణుక, బి.సుజాత, తంబిరాణి, లీల, కొండయ్య, వెంగమ్మ, అంకయ్య, నాగేశ్వరరావు, సతీష్, కమల పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 'ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకలు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్) ఆసుపత్రి నందు గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న వారికి మంచి వైద్య సేవలు జీజీహెచ్‌లో అందు బాటులో ఉన్నాయన్నారు. స్టేట్ కన్సల్టెంట్ బ్లడ్ సెల్ ఎన్‌హెచ్ఎం డాక్టర్ సోనియా మోహన్ మాట్లాడుతూ హీమోగ్లోబిన్ తక్కువ ఉన్న చిన్న పిల్లలకు జీజీహెచ్ నందు పత్యేక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్, డాక్టర్ ప్రియాంక బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి నరసింహా స్వామి క్షేత్రం బ్రహ్మోత్సవాలు ప్రారంభం

– రేపు స్వామి వారి కళ్యాణోత్సవం, అన్నసంతర్పణ

విశాలాంధ్ర-గురజాల: గురజాల నగర్ పంచాయతీ జంగమహేశ్వర పురం లో కొలువై ఉన్న పల్నాడు యాదాద్రి శ్రీ భూ సమేత నరసింహ స్వామి వారి క్షేత్రం అనతి కాలంలో ప్రాచుర్యం పొందింది. స్థానిక రైల్వే గేట్ హాల్ట్ దాటగానే సువిశాలమైన ప్రదేశంలో నరసింహుని క్షేత్రం 2023లో ఏర్పాటు చేశారు. క్షేత్రంలో సువిశాలమైన ద్వారాలు ఏర్పాటు చేయగా నరసింహుడు, వెంకటేశ్వరుడు, పద్మనాభ స్వామి వార్లు కొలువై ఉన్నారు. క్షేత్రం పై భాగంలో నరసింహుని భారీ విగ్రహం ఆకర్షణీయంగా ఉంది. నరసింహ స్వామి వారి క్షేత్రం 3 రోజులు బ్రహ్మోత్సవాలు శుక్రవారం సాయంత్రం ప్రారంభంకానున్నాయి. మొదటి రోజు అంకురార్పణ, యాగం, ధ్వజారోహణ జరుగనుంది. 2వ రోజు శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవం, అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ముగింపు 3వ రోజు ఆదివారం నరసింహ స్వామి యాగం, కాగడ ఖడ్గ సేవ, విద్యుత్ దీపాలతో బ్రహ్మోత్సవం జరగనుంది. 3 రోజుల బ్రహ్మోత్సవాలలో భక్తులు, ప్రజలు పాల్గొని అన్న ప్రసాదములు స్వీకరించాలని నరసింహ సేవా సమితి కోరింది.

పరిమళ (పెర్ఫ్యూమ్) తయారీ అనుభవంతో మాతృదినోత్సవం జరుపుకుంటోన్న టైటాన్ వరల్డ్

విశాలాంధ్ర విజయవాడ (లబ్బీపేట) : ఈ మాతృదినోత్సవ సందర్భంగా, టైటాన్ వరల్డ్ ఆ ప్రియమైన బంధాన్ని పరిమళంతో గౌరవించమని మిమ్మల్ని ఆహ్వానిస్తుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ శాశ్వత బంధాన్ని ఆలోచనాత్మకంగా తీర్చిదిద్దిన స్టోర్ లోపలి అనుభవం ద్వారా వేడుక జరుపుకోవాలన్నారు. మే 10, 11 తేదీలలో, భారతదేశ వ్యాప్తంగా 163 కి పైగా టైటాన్ వరల్డ్ స్టోర్‌లు ప్రత్యేకమైన పరిమళం తయారీ కార్యకలాపాలను నిర్వహించనున్నాయన్నారు. ఇది కస్టమర్‌లు తమ జీవితాల్లో అత్యంత ప్రియమైన మహిళ- తమ తల్లితో చిరస్మరణీయమైన క్షణాలను సృష్టించడంలో సహాయపడటానికి రూపొందించబడిందన్నారు. ఈ కార్యక్రమం గురించి టైటాన్ కంపెనీ లిమిటెడ్, వాచెస్ అండ్ వేరబుల్స్ వైస్ ప్రెసిడెంట్ చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాహుల్ శుక్లా మాట్లాడుతూ మేము నిజంగా వ్యక్తిగతమైన , హృదయపూర్వకమైనదాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మా కస్టమర్లు బహుమతిని మాత్రమే కాకుండా, వారి తల్లులతో శాశ్వత జ్ఞాపకాన్ని సృష్టించుకునే అవకాశం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం , అర్థవంతమైన క్షణాలు శాశ్వత బంధాలను అందంగా ఒడిసిపట్టే టైటాన్ స్ఫూర్తిని అందంగా ఒడిసి పడుతుంది "అని అన్నారు. ప్రీమియం బాటిల్‌లో కస్టమైజ్డ్ పెర్ఫ్యూమ్‌ను తీసుకువెళ్లవచ్చు , ఇది ఈ సందర్భానికి సరైన జ్ఞాపకంగా నిలవనుందని వివరించారు. ఎంజి రోడ్ స్టోర్‌లో ప్రత్యేకంగా స్టోర్‌ల లోపలి వేడుకల ఆనందాన్ని ఆస్వాదించండన్నారు.

జీ తెలుగులో రాబిన్ హుడ్, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు ప్రారంభం!

విశాలాంధ్ర - విజయవాడ లబ్బీపేట: ప్రేక్షకులను ఆకట్టుకున్న సూపర్ హిట్ సినిమా 'రాబిన్హుడ్'ను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నపిల్లల్లోని నటనా ప్రతిభనువెలికితీస్తూ అశేష ప్రేక్షకాదరణతో కొనసాగుతున్న డ్రామా జూనియర్స్ 8 ఈ వారంమాతృదినోత్సవం ప్రత్యేక ఎపిసోడ్తో అలరించేందుకు సిద్ధమైందన్నారు. ప్రారంభం నుంచి జీతెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న జీ తెలుగు సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ ఈవారం ఫినాలేకి చేరుకుందన్నారు. అంతేకాదు కుటుంబ కథతో పవన్ సాయి, అక్షిత, భావన ప్రధానపాత్రల్లో తెరకెక్కుతున్నసరికొత్త సీరియల్ ఘరానా మొగుడు ప్రారంభంకానుందన్నారు. యాక్షన్ఎంటర్టైనర్ రాబిన్హుడ్ ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు, డ్రామా జూనియర్స్ 8 మాతృదినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్ రాత్రి 9 గంటలకు,సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ గ్రాండ్ ఫినాలే ఆదివారం రాత్రి 9గంటలకు, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు మే 12న ప్రారంభం,సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందని తెలిపారు. నితిన్, దేవదత్త నాగే, శ్రీలీల, వెంకీ కుడుముల దర్శకత్వంలో,నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈసినిమాలో నితిన్, శ్రీలీల, దేవదత్త నాగే,సిజ్జు, డేవిడ్ వార్నర్ ముఖ్యపాత్రలు పోషించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించినఈ యాక్షన్ ఎంటర్టైనర్ని మీరూ తప్పకుండా చూసేయండి. ప్రతిభావంతులైననటీనటులు, ఆకట్టుకునే కథతో ఘరానా మొగుడు సీరియల్ జీ తెలుగువీక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ సాయి, అక్షిత ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా,భావన, తేజల్, శరత్ చంద్ర, సుచిత్ర కీలక పాత్రల్లోకనిపించనున్నారు.

షిర్డీ సాయిబాబాకు గులాబీల అర్చన

విశాలాంధ్ర-ఉయ్యూరు : వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని గండిగుంట అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణ షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు లక్ష గులాబీల అర్చన చేశారు. హరినాథ్ బాబు, రాధారాణి, శ్రీశ్రీనివాస విద్యాసంస్థల చైర్మన్ పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ ఆధ్వర్యంలో బాబావిగ్రహానికి గులాబీలు, చామంతులతో అర్చన, అభిషేకాలు నిర్వహించి. భక్తులకు అన్న సమారాధన చేశారు. ఆలయకమిటీ సభ్యులు సేవలందించారు. గండిగుంట, ఉయ్యూరు పరిసర గ్రామాలనుండి భక్తులు తరలి వచ్చి పుజలో పాల్గొన్నారు.

వారసత్వ సంపద ప్రాంతంగా కూచిపూడి

విశాలాంధ్ర-కూచిపూడి : నాట్య క్షేత్రమైన కూచిపూడిని రాష్ట్ర సాంస్కృతిక వారసత్వ సంపద ప్రాంతంగా తీర్చిదిద్దడానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించడంలో అధికారులు నిమగ్నమైనారు. దీనిలో భాగంగా గురువారం ఎంపీడీవో జె విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో (ఈ.ఓ.పి.ఆర్.డి) ఎం.ఎస్.మైన్స్ .కే పరమాత్మ, పి ఆర్ ఏ ఈ వాసుదేవరావు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి ఉమామహేశ్వం రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకట్ (అయ్యకి) తదితరులు గ్రామంలో పర్యటించి కళాకారులకు సంబంధించిన పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కూచిపూడి సెంటర్ లోనే ఆర్చ్ దగ్గర నుంచి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్యకళా పీఠం, నాట్య కళాకారుల ఇలవేల్పైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ సిద్ధేంద్ర యోగి మందిరం, 400 సంవత్సరాల చరిత్ర కలిగినగంటలమ్మ (రావి) చెట్టు,శతాబ్దాల చరిత్ర గలిగిన సత్రం, కూచిపూడి నాట్య లెజెండ్ పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం, చలనచిత్ర నృత్య దర్శకులు పసుమర్తి కృష్ణమూర్తి, యక్షగాన సూత్రధారులు భరతకళాప్రపూర్ణచింతా కృష్ణ మూర్తి, కూచిపూడి సత్యభామపద్మశ్రీ డాక్టర్. వేదాంతం సత్యనారాయణ శర్మ, పసుమర్తి రత్తయ్య శర్మ, అలనాటి సినీ దర్శకులుభరతకళాప్రపూర్ణ వేదాంతం రాఘవయ్య, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధే శ్యాం తదితర కళాకారుల గృహాలు అగ్రహారంలోని పురవీధులను వీడియో, నిశ్చల చిత్రాలుగా నిక్షిప్తం చేశారు. అలాగే కళాకారుల అంగీకారంతో గోడలపై నాట్య సంబంధిత చిత్రాలను వేయించేదుకు ప్రణాళికలు రూపొందిం చారు. దీనికి సంబంధించిన పూర్తి స్థాయి వివరాలను తీసుకొని శుక్రవారం అమరావతిలో పంచాయతీరాజ్ కమిషనర్ నిర్వహించే సమావేశా నికి సమర్పించేందుకు సిద్ధం చేసుకున్నారు ఆ సమావేశానికి ఈ అధికారులు ఇద్దరితోపాటు కూచిపూడి పంచాయతీ కార్యదర్శి కె పుష్పనాదం తదితరులు హాజరవుతారు. ఇదిలా ఉండగా శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం పురవీధిని వారసత్వ నాట్య సంపదగా సమయతమవుతున్నట్టు సమాచారం.

ఆక్వా డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభించిన వాటర్ బేస్

విశాలాంధ్ర-విజయవాడ:- శాస్త్రీయ ఆధారిత సాంకేతిక పరిష్కారాలను రైతుల అందుబాటు లోకి తీసుకెళ్ళాలనే ఉద్దేశ్యం తో తామరకొల్లు గ్రామంలోని నవ్యశ్రీ ఆక్వా ట్రేడర్స్ వద్ద నూతనంగా వాటర్‌బేస్ ఆక్వా డయాగ్నోస్టిక్ సెంటర్ (ఏడీసీ అక్వా ల్యాబ్)ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ను ది వాటర్‌బేస్ లిమిటెడ్ సంస్థ యొక్కచీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అల్లూరి చోల వర్మ, జనరల్ మేనేజర్ ఎమ్ శక్తి గురువారం అధికారికంగా ప్రారంభించి రైతులకు అందుబాటులో తీసుకొచ్చారు. అనంతరం మాట్లాడుతూ నీటి %d% సీడ్ నాణ్యత పరిశీలన, రొయ్య రోగ నిర్ధారణ, నిపుణుల సలహాలు అనేవి వాటర్ బేస్ ఏ డి సి అందించే ప్రధాన సేవలుగా చెప్పారు. ఇప్పటికే నెల్లూరు, భీమవరం గణపవరం ప్రాంతాల్లో విజయవంతంగా సేవలందిస్తున్న వాటర్‌బేస్ ఆక్వా డయాగ్నోస్టిక్ సెంటర్ (ఏ డి సి అక్వా ల్యాబ్) లతో పాటు ఇది కూడా ఆక్వా రైతులకు సమయోచిత సాంకేతిక సలహాలను అందించేందుకు తోడ్పడుతుందన్నారు. రొయ్యల సాగు చేసే రైతులకు త్వరగా, ఖచ్చితమైన సీడ్ , నీటి నాణ్యత విశ్లేషణ, రోగ నిర్ధారణ, ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తుందని రైతులకుశాస్త్రీయ పరిష్కారాలను అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.

వైభవంగా గంగమ్మ సంబరాలు

విశాలాంధ్ర-ఉయ్యూరు : కాటూరులో కొలుసు వారి గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభించారు. కుందేరురోడ్డు లో అమ్మవారి ఆలయంవద్ద గురువారం జరిగిన పూజా కార్యక్రమంలో కొలుసు వంశ స్తులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొలుసు విజయలక్ష్మి, పోతురాజు తదితరులు లాంచనం గా పూజలుచేసి ఊరేగింపు ప్రారంభించారు. ఈనెల 11వరకు జరిగే గంగమ్మ సంబరా లకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్రాజ హాజరవుతారని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కొలుసు వంశస్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని నిర్వా హకులు తెలిపారు.

రూ.2వేల కోట్లతో జల్ జీవన్ మిషన్

- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: జిల్లా వ్యాప్తంగా రూ.2వేల కోట్ల నిధులతో జలజీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కేంద్ర అధికారులకు వివరించారు.జలజీవన్ మిషన్ పథకం అమలు ప్రక్రియ, పథకం అమల్లో ఎదురవుతున్న ఇబ్బందులు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై గురువారం న్యూఢిల్లీ నుండి ప్రాజెక్టు అమలు జరుగుతున్న రాష్ట్రాలలోని జిల్లాల కలెక్టర్లతో కేంద్ర జల జీవన్ మిషన్ ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నగరంలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే జల జీవన్ మిషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ. 2వేల కోట్ల నిధులతో జిల్లాలోని 16 మండలాల లో 337 పనులు జరుగుతున్నాయని, ఇవి వచ్చే ఆగస్టు నాటికి పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.పులిచింతల నుండి నందిగామ, జగ్గయ్య పేట నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని గ్రామాలకు, ఇబ్రహీంపట్నం వద్ద వీటీపీఎస్ కూలింగ్ కెనాల్ నుండి మైలవరం, జి.కొండూరు, తిరువూరు, ఎ.కొండూరు మండలాలలోని వివిధ గ్రామాలతో పాటు గొల్లపూడి వద్ద నుండి ఏలూరు జిల్లాలోని 10 మండలాలు, కృష్ణాజిల్లాలోని 24 మండలాలు, ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, విస్సన్నపేట, జి.కొండూరు మండలాల్లోని వివిధ గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించే కార్యక్రమానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ఈ సమావేశంలో సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్ పాల్గొన్నారు.

మబ్బులతో మొక్కజొన్న రైతులు గుండె గుబేలు

విశాలాంధ్ర-ఘంటసాల: హఠాత్తుగా మబ్బులు ఒక్కసారిగా చీకట్లు కమ్మటంతో మండలంలో మొక్కజొన్న రైతుల గుండె గుబేలు మంటూ మొక్కజొన్న ఒకచోట పోగేసి పరదాలు కప్పుకోవడంలో గురువారం నిమగ్నమయ్యారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఒకేలా వర్షం పడి మొక్కజొన్న తడిసినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించి మమ్మల్ని ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు